నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శనివారం 13 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

రైతుబంధు, రైతుబీమా అమలుపై స్పష్టతనివ్వాలి

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

అధికారులను నిలదీసిన జడ్పీటీసీలు

సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మామిళ్లగూడెం, జనవరి 12 : ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రైతులకు అమలుచేసిన రైతు బంధు, రైతుబీమా పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసే తీరుపై స్పష్టత ఇవ్వాలని, రైతులకు ఆర్థిక చేయూతనందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ఎజెండా అంశాలుగా సమీక్షించారు. చైర్మన్ కమల్‌రాజు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఆశించిన మేర పంట దిగుమతులు రానందున, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు. వ్యవసాయశాఖ నివేదిక వివరించే క్రమంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు రైతు బంధు, రైతుబీమా అమలుపై రైతులకు వివరించాలని అధికారులను నిలదీశారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల మాట్లాడుతూ ఈ యాసంగి 2023-24కు సంబంధించి 1,66,319 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 39,411 మెట్రిక్ టన్నుల వివిధరకాల ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో మత్స్యశాఖ ఏడీ పనితీరుపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలకు రావాల్సిన ఆదాయం రాకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల భూముల్లో గిరిజన రైతులు బోర్లు వేసుకునేందుకు అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, ఇతర రైతుల వద్ద లంచాలు తీసుకుని వారిపట్ల చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ఆరోపణలు వచ్చిన ముగ్గురిని సస్పెండ్ చేశామని, బోర్ల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వుల కోసం నివేదిక పంపించినట్లు తెలిపారు. జిల్లాలో అమలుచేస్తున్న కార్యక్రమాలపై డీఆర్డీవో విద్యాచందన నివేదిక సమర్పించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసునాయక్ మాట్లాడుతూ అధికారులు రైతుల అవసరాలను గుర్తించి వారికి సహాయసహకారాలు అందించాలన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేంలో జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీ అప్పారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, మైన్స్‌శాఖ ఏడీ సంజయ్‌కుమార్, వివిధశాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 12: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలోని మూలవరులకు శుక్రవారం అర్చకులు బెంగళూరుకు చెందిన భక్తులు రూ. 5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అలంకరించారు. సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేపట్టారు. ఆరగింపు సేవ చేశారు. అనంతరం కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం చేపట్టారు. కల్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.



ఎస్జీటీల ఢీఎస్సీ

ఖమ్మం, జనవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అవుతుందా అని ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్నారు.. ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ విడుదలవుతుం



దని ఆశల పల్లకీలో తేలియాడుతున్నారు. ఇది ఒకవైపు అయితే మరోవైపు డీఎస్సీలో రాష్ట్ర విద్యాశాఖ ఎన్ని ఖాళీలు భర్తీ చేయనున్నదనే అంశంపై స్పష్టత లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టుల ఖాళీల విషయంలో ఉద్యోగోన్నతుల అంశంపై ఎక్కువ అస్పష్టత నెలకొన్నది. అందుకు కారణం గత సంవత్సరం జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీల ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిలిచిపోవడమే. ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందాలంటే టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరి. ఈ నిబంధన ఉండడంతో న్యాయస్థానాలు కూడా పక్కాగా నిబంధనలు అమ లు చేయాలని ఆదేశిస్తున్నాయి. దీంతో డీఎస్సీకి ఎస్జీటీల ఉద్యోగోన్నతులు అడ్డంకిగా మారాయి.

జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఇలా..

ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందేందుకు జిల్లావ్యాప్తంగా 435 మంది అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారు. వీరికి సంబంధించిన సీనియార్టీ జాబితా ఇప్పటికే విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు. కానీ వీరిలో కేవలం 70శాతం మందే టెట్ అర్హత సాధించి ఉండడం మిగిలిన వారు అర్హత సాధించకపోవడంతో ఉద్యోగోన్నతులు నిలిచిపోయాయి. జిల్లాలో ఉద్యోగోన్నతులు కాకుండా 330 వరకు ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగోన్నతులు నిర్వహించకుండా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తే పోస్టులు తక్కువగా ఉంటాయి. ఉద్యోగోన్నతుల ప్రక్రియ కూడా నిర్వహిస్తే 330తో పాటు ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు పొందితే ఖాళీల సంఖ్య 435 వరకు పెరుగుతుంది.

ప్రత్యేక టెట్‌కి డిమాండ్..

ప్రస్తుతం ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలనే డిమాండ్ ఎక్కువ టీచర్ల నుంచి వినిపిస్తున్నది. ఉపాధ్యాయ సంఘాన్నీ ఇప్పటికే ప్రత్యేక టెట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ విద్యాశాఖలోని ఉద్యోగోన్నతుల ప్రక్రియ కారణంగా డీఎస్సీ ఆలస్యమ య్యే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి. కోర్టు కేసు లు, ఖాళీల వంటి అంశాల్లో విద్యాశాఖ అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం ఖాళీగా ఉన్న పోస్టు ల్లో విద్యా వలంటీర్లును నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగోన్నతు ల ప్రక్రియ అనుకున్న దా ని కన్నా ఆలస్యమవుతుందనేది స్పష్టమవుతున్నది.

టెట్‌కు సన్నాహాలు...

త్వరలో టెట్ నోటిఫికేషన్ విడుదలవుతుందనే సంకేతాలు ఇప్పటికే ప్రభుత్వం నుంచి వెలువడుతున్నాయి. గతేడాది టెట్ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా పేపర్-1, 2కు 23,403మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పేపర్-1కు 12,923 మంది, పేపర్-2కి 10,480 మంది దరఖాస్తు చేశారు. పరీక్ష మొత్తం 150 మార్కులకు పేపర్ ఉంటుంది. వీటిలో ఓసీలు 90 మార్కులు సాధిస్తే అర్హత పొందినట్లు. బీసీలు 75, ఎస్సీలు 60 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

పరీక్ష సరళంగా ఉండాలి..

ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. అది కూడా సరళంగా ఉండాలి. ఎస్జీటీల ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతనే ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించాలని సంఘాల తరపున డిమాండ్ చేస్తున్నాం. పీజీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన మాదిరిగానే బదిలీల ప్రక్రియ జరగాలి.

– మోత్కూరి మధు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలి. చిన్న చిన్న అడ్డంకులను అన్నింటినీ విద్యాశాఖ అధిగమించి ప్రక్రియ చేపట్టి డీఎస్సీ నిర్వహించాలి. డీఎస్సీలో కూడా అన్ని కేటగిరీలకు సంబంధించిన ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి.

– నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రామాలయంలో కూడారై ఉత్సవం

ఆండాళ్ అమ్మవారికి పరమాన్నాన్ని నివేదన చేసిన అర్చకులు

భద్రాచలం, జనవరి 12 : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజును పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి 108 పాత్రల్లో పరమాన్నాన్ని భక్తిశ్రద్ధలతో నివేదించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆండాళ్ అమ్మవారిని, శ్రీకృష్ణ పరమాత్మను బేడా మండపంలో వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత తిరుప్పావైలోని పాశురాన్ని అర్చకులు పఠించారు. ఆండాళ్ అమ్మవారు శ్రీకృష్ణ పరమాత్మతో తనకు వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్ని నివేదన చేస్తానని మొక్కుకుంటుంది. ఆ సమయంలో అమ్మవారికి శ్రీకృష్ణ పరమాత్మతో వివాహం కావడంతోపాటు ఆయనలో ఐక్యమయ్యారు. దీంతో ఏటా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ తర్వాత ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో తీసుకొచ్చి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సీతారామ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, అహోబిల మఠంలోనూ కూడారై ఉత్సవాన్ని వైభవంగా జరిపారు.

మిర్చి కాంటాలో కోతలెందుకు?

ఖమ్మం, జనవరి 12 : వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు ధర నిర్ణయించిన తర్వాత కాంటాలో కోతలు ఎందుకు పెడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ కార్యదర్శిని ప్రశ్నించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మంత్రి తుమ్మల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చి యార్డులో మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి మంత్రి కలియ తిరిగారు. రైతు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి పంటను పట్టుకుని నాణ్యతను పరిశీలించారు. యార్డులో మిర్చి నాణ్యతను పరిశీలించే అధికారి ఎక్కడ ఉన్నాడని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వాలిటీ మిర్చికి వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తుంటే.. అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదని మండిపడ్డారు. మార్కెట్‌కు సరుకు తెచ్చిన రైతులు మోసపోకుండా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని వ్యాపారులకు నిర్దేశం చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే రైతుల లాట్‌ల వద్దకు వెళ్లి 'ఎంత పంట వేశారు.. ఖర్చు ఎంత.. దిగుబడి ఎంత వచ్చింది' అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. రైతులు మాత్రం క్వింటా మిర్చి గత ఏడాది రూ.14 వేలు పలికితే.. ఈ ఏడాది రూ.10 వేలు ధర పెట్టి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. తనిఖీలో మంత్రి వెంట రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీభాయి, డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ నిర్మల, మార్కెట్ డీఎం అలీం తదితరులు ఉన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మార్కెట్‌లో క్వాలిటీ తనిఖీ అధికారి ఎక్కడ?

ఖమ్మం మార్కెట్‌లో పంట కొనుగోళ్లపై మంత్రి తుమ్మల అసంతృప్తి

కూలిన జిల్లా గ్రంథాలయ పాత భవనం

- సెలవు కావడంతో తప్పిన పెనుప్రమాదం
- నేటి నుంచి వారం రోజుల పాటు లైబ్రరీలోకి అనుమతి లేదు
- సహాయక చర్యలను పరిశీలించిన మంత్రి తుమ్మల, కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 12: ఖమ్మం నగరంలోని జిల్లా గ్రంథాలయ పాత భవనం శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలింది. శుక్రవారం లైబ్రరీకి సెలవు కావడం, విద్యార్థులు, సిబ్బంది ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తెలిసిన వివరాల ప్రకారం.. నగరంలోని పెవిలియన్ మైదానం పక్కనే 1957లో నాటి పాలకులు జిల్లా గ్రంథాలయ సముదాయాన్ని నిర్మించి ప్రారంభించారు. సముదాయంలో చైర్మన్ చాంబర్, రీడర్స్ గది, టాయిలెట్స్ ఉంటాయి. బిల్డింగ్ పాతదైపోవడంతో కాలం చెల్లిపోయి కూలిందని అధికారులు వెల్లడించారు.

భయంతో బయటకు పరుగులు..

నాటి నుంచి నేటి వరకు గ్రంథాలయంలో లక్షలాది మంది చదువుకున్నారు. నానాటికీ పాఠనాసక్తి తగ్గుతూ వస్తున్నప్పటికీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వందలాది మంది ప్రస్తుతం ప్రతిరోజూ గ్రంథాలయానికి వస్తారు. ఘటన జరిగిన సమయంలో కొత్త భవన సముదాయంలో సుమారు 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. భవనం కూలిన శబ్దం రావడంతో వీరంతా ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారం పాటు గ్రంథాలయ ప్రాంగణంలోకి వెళ్లేందుకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కూలిపోయిన బ్లాక్‌తో పాటు పక్కనే ఉన్న మరో పాత భవనాన్ని కూల్చి వాటిస్థానంలో నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాత భవనం కూలిన దృష్ట్యా కొత్త బ్లాక్ పటిష్ఠతపై ఇంజినీర్లతో అధ్యయనం చేయిస్తామన్నారు. వారి వెంట అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో గణేశ్, గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి ఉన్నారు. అనంతరం ఘటనా స్థలాన్ని ఖమ్మం మేయర్ నీరజ సందర్శించారు. అక్కడి పరిస్థితులపై లైబ్రరీ అధికారులు, పోలీసులను ఆరా తీశారు.

భవన వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ

ఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల

ఘటనా స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. వారం రోజుల పాటు లైబ్రరీ సముదాయంలోకి ఎవరినీ అనుమతించరాదని హెచ్చరించారు. అలాగే జిల్లాలో పాతబడిన భవనాలన్నింటినీ వెంటనే కూల్చివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీల బడ్జెట్ రూపొందించాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, జనవరి 12: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల బడ్జెట్‌ను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. బడ్జెట్ రూపకల్పనపై మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వేతనాలు, కరెంట్ చార్జీలు, సీసీ ఛార్జీలు, రుణాల చెల్లింపులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. మున్సిపాలిటీలు ప్రభుత్వం అందించే గ్రాంట్‌తోపాటు రెవెన్యూను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వంద శాతం వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తి 'కోరం'

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, జడ్పీ చైర్మన్ కంచర్ల

జడ్పీ మాజీ చైర్మన్, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఘనంగా వీడ్కోలు

ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, జడ్పీ చైర్మన్ కంచర్ల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : జడ్పీ చైర్మన్‌గా జిల్లాలో అందరినీ కలుపుకొనిపోతూ.. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో జడ్పీ చైర్మన్‌గా నాలుగేళ్లకుపైగా కొనసాగి.. తిరిగి ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్య సన్మాన సభ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బిడ్డగా కోరం కనకయ్య కోయగూడెం నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టారన్నారు. జడ్పీ చైర్మన్‌గా నాలుగేళ్లకుపైగా పని చేయడంతోపాటు ఇల్లెందు ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచారని అన్నారు. వివిధ శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులతో ఆప్యాయంగా ఉంటూ.. వారిని నొప్పించకుండా ఒప్పించి ప్రజాసేవ కోసం పనిచేసిన కనకయ్య అభినందనీయులని అన్నారు. నాలుగేళ్ల పదవీ కాలంలో ఎక్కడా ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా పని చేశారన్నారు. ఈ సందర్భంగా కోరం కనకయ్య, లక్ష్మి దంపతులను గజమాలతో సన్మానించారు. జడ్పీ సీఈవో విద్యాలత అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో అదనపు కలెక్టర్ మధుసూదనరాజు, జిల్లా సంక్షేమాధికారి విజేత, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, డీపీఆర్వో శ్రీలం శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్ రవిబాబు, ఎంపీడీవో రామారావు, ఎంపీవో మన్నె శ్రీనివాసరావు మాట్లాడారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీ ఉద్యోగులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ కేటాయింపును రద్దు చేయాలి

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆందోళన

భోజన విరామ సమయంలో భారీ ప్రదర్శన

అశ్వారావుపేట, జనవరి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. హైకోర్టుకు బయో డైవర్సిటీ భూముల కేటాయింపును నిరసిస్తూ శుక్రవారం భోజన విరామ సమయంలో విద్యార్థినీ విద్యార్థులు స్థానిక కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తొలుత కళాశాల ప్రాంగణం నుంచి జాతీయ రహదారి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి కీలక పరిశోధనలపై భూముల కేటాయింపు పెను ప్రభావం చూపుతుందన్నారు. పర్యావరణవేత్తలు, పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, నాయకులు వర్సిటీ భూముల రక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైకోర్టు నిర్మాణంతో పర్యావరణానికి తీరని నష్టం కలుగుతుందని, అరుదైన వృక్ష, జీవజాతులు అంతరించిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో పచ్చని వాతావరణానికి చిచ్చుపెడతారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 55ను రద్దు చేయకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 55కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కేటీపీఎస్‌లో ముగిసిన జెన్కో రాష్ట్రస్థాయి క్రీడలు

విజేత జట్టుకు కప్ అందజేస్తున్న టీఎస్ జెన్కో డైరెక్టర్ లక్ష్యయ్య

పాల్వంచ, జనవరి 12: కేటీపీఎస్ ఏడో దశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు డైరెక్టర్ (థర్మల్) బీ.లక్ష్మయ్య, సీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, ట్రైనింగ్ సీఈ శ్రీనివాసబాబు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఫుట్‌బాల్ పోటీల్లో కేటీపీఎస్ 5, 6 దశల జట్టు మొదటి స్థానంలో, కేటీపీఎస్ ఏడో దశ జట్టు రెండో స్థానంలో, కేటీపీపీ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. అదే విధంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీశైలం జట్టు మొదటి స్థానం, కేటీపీపీ జట్టు రెండో స్థానం, కేటీపీఎస్ ఏడో దశ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ సెక్రటరీ లోహిత్ ఆనంద్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వీరస్వామి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.